# గిరిజనేతరుల గిరిజన సాహిత్యం- పునర్వీక్షణం

ఆచార్య జి. అరుణకుమారి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

అనేక మార్పులను ఇముడ్చుకుంటూ ముందుకు సాగిపోవడం మానవనైజం. ఎద్దులబండి, సైకిలు, రిక్షా, స్కూటరు, కారు.... ఇలా ఎన్ని రవాణా సౌకర్యాలు కాలానుగుణంగా వచ్చినా ఏ ఒక్కటీ అంతరించి పోలేదు. మానవ సంఘం ఎన్ని దశలు దాటినా, ఎన్ని పరిణామాలు పొందినా అన్ని దశలకు సంబంధించిన లక్షణాలు సంఘంలో ఉంటూనే ఉంటాయి. అన్ని లక్షణాలను కలుపుకుంటూనే సంఘం ముందడుగు వేస్తుంది. ఎన్ని వాహనాలు వచ్చినా సైకిలు సాంకేతికత అన్ని వాహనాలకు ప్రాథమిక సూత్రం అయినట్టుగానే మనందరికీ మూలం గిరిజనులే అనేది అక్షర సత్యం.

**గిరిజనులు**

కొండలలో, అడవులలో సంచరించి ఆహారాన్ని సేకరించి, లేదా వేటాడి జీవించే మానవ గుంపులు వ్యవస్థీకృతమైనపుడు ఒక కుదురుగా ఏర్పడతారు. కొన్ని కుదుర్లు కలిసి ఒక తెగగా లేక గణం (ట్రైబ్) గా ఏర్పడతారు. పోడు వ్యవసాయం చేసేవారిని, అడవులమీద ఆధారపడే వారిని గిరిజనులని, చరిత్ర చెబుతుంది. A group of persons families or clans believed to be descended from a common ancestor and forming a close community under a leader or chief

-Webster new world dictionary, 1970

ఋగ్వేదం ప్రథమ మండలం ఏడవ సూక్తం తొమ్మిదవ మంత్రంలో పంచజనులకు, పంచక్షితులకు నిషాదులనే అర్థాన్నిచ్చాడు వేద భాష్య కర్త అయిన సాయణుడు.

‘య ఏకశ్చర్షణీనామిరజ్యతి
ఇంద్రః పంచక్షితీనామ్’

పంచక్షితులంటే బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర నిషాదులు.

## ప్రాచీన తెలుగు సాహిత్యం- గిరిజనులు

దేవతా యుగం నుండి నేటి వరకు వచ్చిన సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన ప్రదర్శితమవుతుంది. శివుడు హిమవంతుని పుత్రిక పార్వతిని వివాహమాడాడని, విష్ణువు నరసింహావతారుడై చెంచులక్ష్మిని వివాహమాడాడని, రాముడు గిరిజనలతో సహవాసం చేశాడని, కురుపాండవ వంశానికి మూలమైన శంతనుని భార్యలు ఆనాటి వనచరులేనని మన ప్రాచీన సాహిత్యం ఆధారంగా విశదమవుతుంది. వ్యాస భారతంలోని బహు భర్తృత్వం కూడా ఈనాటి గిరిజన తెగలలో(తోడాలు- విజిటింగ్ వైఫ్) కనిపిస్తుంది. మొదటి కావ్యంగా గుర్తించబడిన రామాయణం బహు భర్తృత్వ సంస్కృతి నుంచి సమాజాన్ని కాపాడేందుకే కదా. ఆ రామాయణ కావ్యాన్ని రచించింది వాల్మీకి ఒక బోయవాడు. క్రౌంచ మిథునాన్ని చూసిన వాల్మీకికి శోకం శ్లోకంగా రూపొందింది. గిరిజనులు జంట

పక్షులను వేటాడటం మహా పాపంగా పరిగణిస్తారు. పశ్చాత్తాపం మనిషిని మహోన్నతుడిని చేస్తుంది. స్త్రీలపై గౌరవాన్ని కలిగి ఉండాలనే దృష్టితోనే కదా పార్వతి, లక్ష్మి సరస్వతులను రూపొందించారు.

ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే ఆనాటి ప్రభువులకు గిరిజనులు వేటలోనే ఉపయోగపడ్డారు. శ్రీకృష్ణదేవరాయలు రాజ్య రక్షణ కోసం గిరిజనులను రాజ్య సరిహద్దులలోనే నిలిపి గౌరవించాలన్నాడు. పెద్దన మను చరిత్రలో, పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో, ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహత్యంలో, అయ్యలరాజు రామభద్ర కవి రామాభ్యుదయంలో, తెనాలి రామకృష్ణ కవి పాండురంగమహత్మ్యంలో, పొన్నగంటి తెలగన యయాతి చరిత్రలో, చేమకూర వేంకటకవి సారంగధర చరిత్రలో, కంకంటి పాపరాజు ఉత్తర రామ చరిత్రలో .... అనేక కావ్య ప్రబంధాలలో శహాజి రచించిన కిరాతవిలాసం, వల్లీ కళ్యాణం, శంబరధరుడు రచించిన కిరాతార్జునీయం, అన్నయకవి తెనాలి రచించిన సుదక్షిణా పరిణయం, భూమయ్య రచించిన శ్రీ చెంచులక్ష్మీ కళ్యాణం, భాగయ్య చెర్విరాల కిరాతార్జునీయం మొదలైన యక్షగానాల్లో గిరిజనుల వేట, రాజులకిచ్చే కానుకలు, వైద్యం, ఆసవాలను తయారు చేయడం వంటి విషయాలను ప్రస్తావించారు.

గిరిజన తెగలు 33ఉండగా పైన పేర్కొన్న రచనలలో కోయ, చెంచులు, ఎరుకలు, భిల్లలు, బోయల ప్రస్తావన మాత్రమే కనిపిస్తుంది. మిగిలిన 28గిరిజన తెగల ప్రస్థావన కనిపించదు.

- పెద్దన మను చరిత్రలో (4-60) గిరిజనులు పులిని చంపి మీసాలను ఇతరులకు దక్కకుండా కాల్చేవారు. లేదా ముక్కలు చేసి పరమాన్నంలో కలిపి శత్రువులకు తినిపించేవారు.అలా చేస్తే వారు మరణిస్తారని గిరిజనుల విశ్వాసం. కాల్చివేస్తే దుష్ప్రయోగాలు చేయరని భావించేవారు.
- గిరిజనులు పులులను మంత్రించి వాటి నోళ్ళు కట్టివేసేవారు.
- ధూర్జటి, పెద్దన గిరిజనుల వేటను వర్ణించారు.
- పిల్లలమర్రి పినవీరభద్రుడు శృంగార శాకుంతలంలో, వెలగపూడి కృష్ణయామాత్యుడు -భానుమద్విజయంలో, పోకూరి కాశీపతి( గద్వాల సంస్థానం 1930)-హరిశ్చంద్రోపాఖ్యానంలో కుక్కల పేర్లను వివరించారు.
- పాల్కురికి సోమన- ఏనుగుల పేర్లు, పోతన- ఆవుల పేర్లు, పాలవేకరి కదరీపతి- శుకసప్తతిలో, అయ్యలరాజు రామభద్ర కవి- రామాభ్యుదయంలో ఏనుగుల వేటను ప్రస్తావించారు.
- తెనాలి రామకృష్ణ కవి- పాండురంగ మహత్మ్యంలో బోయ జీవితాన్ని వివరించాడు. పొన్నగంటి తెలగన - యయాతి చరిత్రలో వేటాడిన పక్షులు, కాత్రేని పూజను గురించి చర్చించాడు.
- చేమమూర వెంకటకవి -సారంగధర చరిత్రలో చెంచులు, గిరిజనుల భాషను వర్ణించాడు.

ఎలుగుబంటి మాంసం తిన్నవారికి చేతబడి వర్తించదనే విశ్వాసం గిరిజనుల్లో ఈనాటికీ ఉంది.

ఈ రచనలలో అధికంగా రాజులను వేటకు రమ్మని చెంచులు, బోయలు, ఎరుకలు, కోయలు ఆహ్వానిస్తారు. తమకు సాధ్యం కాని వేటకు రాజును ఆహ్వానించేవారు. పలు రకాల అడవి సంపదను బహుకరించేవారు. నాలుగు తెగలే వర్ణనలో కనిపిస్తారు.

కేశవరెడ్డి రచించిన అతను అడవిని జయించాడు నవలలో కింద పేర్కొన్న గిరిజన విశ్వాసాలను గమనించవచ్చు

- వేటాడే సందర్భంలోనే కుందేళ్ళు జంటగా ఉంటే జంటను విడదీయడం మహా పాపం(పుట 23) అని భావించేవారు. (వాల్మీకి కవి కావడానికిజంటను విడదీయడమే కారణమయ్యింది)
- 'ఈ రోజు నువ్వు ఎడం ప్రక్కన నిద్రలేచావు' అనుకుంటూ అతడు విలవిల తన్నుకుంటున్న ప్రాణి చెంతకు నడిచాడు (పుట 24)
- 'ఉదయం నిద్ర లేవగానే అతడు మొదటిసారిగా చూసేది తన పందులనే. రాత్రి పడుకోబోయే ముందు చివరి సారిగా చూసుకునేది కూడా పందులనే. ఉదయం నుండి సాయంత్రం దాకా అతడు జీవించేది పందులతోనే. సందె వేళ నుంచి తెల్లవారే దాకా అతడు కలలుగనేది కూడా పందులను గురించే(పుట 46)
- పంది 'జల్లుకట్టు లో ఆబోతు తనున్న పొదలో గిరగిరా తిరిగింది'. ఎద్దుల పందాన్ని తమిళనాడులో జల్లికట్టు అంటారు. చిత్తూరులో పశువుల పండగ అంటారు. (పుట 59)
- " వెదురు బద్ధలతోనూ తీంట్ర తీగలతోనూ గంపను అల్లి సలుగులను అందులో వేసుకొని పందిని వెంటబెట్టుకొని అడవి వదలి వెళ్ళిపోతాను' వెదురు బద్దతో గంపను అల్లటానికి వెదురును నాన బెట్టాలి. అప్పటికప్పుడే అల్లిక కుదరదు.
- 'ఆ మరణానంత్రం నాకది ప్రతిరాత్రీ కలలో కనబడుతూ ఉంటుంది' (పుట 76)
- గిరిజనుల సంస్కృతిలో కలలకు ప్రాధాన్యం ఉంది. కలలో కన్య కనిపిస్తే వేటలో ఒక జంతువైనా దొరుకుతుంది. గర్భవతి కనిపిస్తే వేట విఫలమవుతుంది. పులి కనిపిస్తే శుభసూచకం, కొన్ని సందర్భాల్లో ఆకలిని సూచిస్తుంది. ఎలుగుబంటి కలలో కనిపిస్తే పంటలకు నష్టం. గుర్రం అధిక గోధుమ పంటను సూచిస్తుంది. చుక్కలున్న జింక – కుష్టును, జంతువు వలలో పడినట్టుగా కలవస్తే – మరణాన్ని, గేదె– భార్యాభర్తలకు మధ్య మనస్పర్థలు, నెమలి–అశుభాన్ని, పెంచిన మేక లేదా పంది కలలో కనిపిస్తే కుటుంబ సభ్యుల మరణాన్ని, పంది కనిపిస్తే జాతరలో బలిని కోరుతుందని, రాయి తగిలి తూలితే వేటలో జంతువు తప్పక దొరుకుతుందని గిరిజన సామాజిక సాంస్కృతిక అంశాలు వివరిస్తున్నాయి

- man and forest series – socio cultural aspects of plants animals and humans. Editors K. Seeland and F. Schmthiisen ( p-204)

ఎరుకల వాని జీవనాన్ని చిత్రించే నవలిక అయినా అతడు అడవిని జయించాడనే తాత్వికార్థం అపురూపం. అందుకే ఈ నవలకంత పేరు వచ్చింది. గిరిజన జీవనంలోని కష్టాన్ని కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు.

అరుణ రచించిన ఎల్లి నవల గిరిజన జీవన విధానాన్ని వర్ణిస్తుంది. ఫాక్‌నర్ రాసిన 'యాజ్ ఐ లే డైయింగ్ ' నవలలో ఆయా పాత్రలు వచ్చి కథను నడిపినట్టుగానే ఎల్లి నవల ఆరంభంలో పాత్రలు వచ్చి కథను ముందుకు నడిపిస్తాయి. ఎరుకల వారి జీవనం ఈ నవలలో ప్రధాన వస్తువు.

సోది చెప్పటం, బుట్టలు చాపలు అల్లటం, పందులు మేపటం, చింతచిగురు కోయటం, పిట్టలను పట్టటం, మంత్రిసాని వైద్యం.... వంటి పనులపై వీరి జీవనం ఆధారపడి ఉంటుంది. వీరిలో ఓలి, మగనోలి ఉంది. ఆడవారికి గౌరవం లేకపోవటం, స్త్రీని వస్తువుగా చూడటం కనిపిస్తుంది. ఎల్లి నవలలో పందులను మేపుకునే ఎరుకల వారి జీవన విధానం, సామాజిక సమస్యలు ప్రధానంగా కనిపిస్తాయి. ఈనవల ఆధారంగా మనకు తెలిసే విషయాలు.

**గిరిజనులలో వర్ణ సంకరానికి కారణాలు**

గొల్లవాళ్ళు బుధవారం ఆడపిల్ల పుడితే అరిష్టమని, ఆబిడ్డను మంత్రసాని ఎరుకలామెకు ఇచ్చివేయటం.

**భాష**

సలుగులు- పంది పిల్లలను గున్నలు అంటారు. వయసుకొచ్చిన మగ పంది పిల్లలను సలుగులు అని, వయసుకొచ్చిన ఆడ పందులను పద్దలు అని అంటారు. (నిజామాబాద్ జిల్లాలో )


1. డా. విట్టవేణుగోపాలు- ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ 18వ శతాబ్ది వరకు (2008)
2. సాధన- సరిహద్దు
3. సాధన - రాగో
4. అరుణ - ఎల్లి
5. కేశవరెడ్డి - అతడు అడవిని జయించాడు.
6. కేశవరెడ్డి - చివరిగుడిసె
7. సాహు, అల్లం రాజయ్య - కొమరం భీమ్
8. మల్లికార్జున హిరేమఠ్ -తాండా (కన్నడం), తెలుగు: జయశ్రీ మోహన్‌రాజ్, ఎస్.మోహన్‌రాజ్.
9. డా. వి.ఎన్.వి.కే. శాస్త్రి - ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి పరివర్తన
10. నదీం హస్‌నైన్ - భారతీయ గిరిజనులు, ఓరియంట్ లాజ్మన్

11. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సమస్యలు, సంక్షేమం – తెలుగు అకాడమీ

12. Tribal welfare department – savaras A monograph

13. ఎ. విద్యా సాగర్ – భద్రాచలం మన్నెం కతలు

14. డా.వి.లలిత – ఆదివాసీల సంస్కృతి, అరకులోయ ప్రత్యక్షానుభవాలు, వాఙ్మయి

15. Ethnobotonical wisdom of the Tribals in the Palni hills. Rev. Dr. S.m> John Kennedy 2008 daya publishing house Delhi, 110035 (page-27) The institution of monkey is sun dried and cooked and eaten. This cures paralysis, heart attacks and swelling of joints asthma, T.B, wheezing

16. 1/70 చట్టం కింద నర్సరీల మాటున భూ ఆక్రమణ, మామిడి మొక్కల పెంపకం పేరిట భూమిని సొంతం చేసుకుంటున్నారు. ఏడాదికి 100 కోట్ల మేర వ్యాపారం చేస్తూ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి చెల్లించటం లేదు దళారులు. మామిడి మొక్కల పెంపకం మాటున గిరిజన చట్టాలను ఉల్లంఘించడం, అమాయక గిరిజనులను అన్ని వర్గాల దోపిడీకి గురి చేస్తూ, వారి పేదరికాన్ని ఆసరాగా తీసుకొని గిరిజనుల ఆశ్రయం పొంది వారిని ఎటుగాని పరిస్థితికి లోను చేస్తున్నారు. గిరిజన గ్రామాల మధ్య ప్రాజెక్టుల పేరుతో రహదారుల నిర్మాణాలు చేస్తూ గనులు, వనాల దోపిడీలు. ప్రాజెక్టు పేరుతో ఏ పథకాన్ని వర్తింపచేయక పోవటం, పునరావాస కల్పన పేరుతో కల్పన చేయటం, నక్సల్స్‌కు సహాయం చేస్తున్నారని, జంతువులకు రక్షణ కోసం తరలింపులు, విలువైన ఖనిజాలను కనుగొన్నారని గిరిజనులు దానికి ఆటంకం అని రకరకాల మోసాలతో అడవి జీవనం రోజూ ఒక యుద్ధమే.

– (గిరిజన జ్యోతి, ఎన్.భీమల్‌నాయక్, మే, 2010. సంచిక 17, సంపుటి 10)